# పోలికలు

హితశ్రీ

అరుణోదయాన్ని చూసే అలవాటు ఆ ఇంట్లో ఇంటి ఇల్లాలికి తప్ప ఇంకెవరికీ లేదు. నారాయణరావు మూడో జాముకి గానీ క్లబ్బు వదిలి ఇంటికి చేరడు. చలపతి చదువుకోటాని కనే నెపంతో స్నేహితు డింటికి మసకచీకట్ల వేళే వెళ్ళి, ఏ రెండో ఆట సినిమాకో, నాటకం రిహార్శల్‌కో హాజరై, తండ్రి కంటే రెండడుగులుమాత్రం ముందుగా గూటికి చేరతాడు. ఇంక పద్మకి మొదటి నించీ ఆలోచనలు జాస్తి. అందులో ఈ మధ్య పక్కవాటాలోని ముందుగదిలో గుసగుసలు ఆమెని నిద్ర పోనివ్వవు. ఇంక సప్తాశ్వాల మీద ఉరుకులు పరుగులు తీసి సూర్యభగవాను డెంత హడావిడి చేస్తేమాత్రం వాళ్ళ కేమెరుక? ఒక్క సావిత్రమ్మ మాత్రం, పొద్దస్తమానమూ చాకిరితో సతమతమై పక్కమీద మేను వాల్చగానే ఆదమరిచి నిద్రపోయినా, తొలికూడి కూతకే లేచి ఒక్కసారి ఆ ముగ్గురివైపూ చూసి, కిటికీ తలుపులు దగ్గిరగా వేసి, దినచర్యలో నిమగ్నమైపోతుంది.

నారాయణరావూ, చలపతీ, పద్మా ముగ్గురూ మూడు రత్నాలని ఆమె నమ్మకం, దుమ్ముతో నిండిన లోకంలో వాళ్ళు ప్రకాశింపలేకపోవచ్చు. అది వాళ్ళ లోపంకాదు. అందువల్ల వాళ్ళకి సావిత్రమ్మ సానుభూతి పూర్తిగా ఉంది.

నిజానికి నారాయణరావు మంచివాడే. తెలివిగలవాడే. ఆ రోజుల్లో బి. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసైన ఘనతగలవాడే. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో మంచి అభివృద్ధిలోకి రాగల అవకాశా లున్నాయని సర్వీసు కమిషన్ పరీక్షకి కూర్చొని రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఎల్. డి. సి గా సెలక్షన్ సంపాదించుకున్న ఘనుడే. అయితే దురదృష్టవశాత్తూ, ఏ కారణం వల్లనైతే యేం అతను ఆశించిన అభివృద్ధి లభింపక నిస్పృహ చెందాడు. రాత్రింబగళ్ళు చేసిన చాకిరీకి ప్రతిఫలం ఎల్. డి. సి. గా కన్‌ఫరమ్ అవటమే. అతని తోటివా రెందరో పైపదవుల్లోకి పోయారు. కాని నారాయణరావుని అదృష్టం కటాక్షించలేదు. దాంతో జీవితంమీద ఒక నిరసన భావమూ, అలసత్వమూ కలిగాయి. ఇప్పుడు అయిదు దాటితే హరిహరాదులు అడ్డుపడినా ఆఫీసులో ఉండడు. వెనకటి నమ్రత లేదు. ఎంతటి ఆఫీసరునైనా సరకు చెయ్యకుండా "రూల్" కోట్‌చేసి నోరు కట్టిస్తాడు.

ఒక్కడిగులు మాత్రం అతన్ని కుంగదీస్తోంది ఏదో పెద్ద ఉద్యోగం చేసి భార్యా బిడ్డల కేమో ఒరగపెడతా మని కలలు కనేవాడు. ఆ ఆశలు అడియాసలయాయి. ఉన్న ఆస్తి సర్వస్వం మూడెకరాలు చలపతికి పెద్ద చదువులు చెప్పించి ఫారిన్ పంపాలనీ, పద్మకి గొప్ప సంబంధం తేవాలనీ పదేపదే అంటుండేవాడు. అవన్నీ ఒట్టి మాటలై పోయాయి. మూ డెకరాల ఆస్తితో తనేం సాధించగలడు

ఇలా నిస్పృహ చెందే తరుణంలో ఒక సంఘటన జరిగింది. స్నేహితుల బలవంతం మీద రూపాయిపెట్టి కొన్న రాఫిల్ టికెట్ సంగతి తను ఎప్పుడో మర్చిపోయినా, అది తనని మర్చిపోకుండా ఒక వందరూపాయిల బహుమతి తెచ్చింది చీకటిలో ఒక మెరుపు మెరిసినట్టయింది. అప్పటినించీ నారాయణరావు రాఫిల్ టిక్కెట్లు కొనటం, పజిల్స్‌కి డబ్బు కట్టటం ప్రారంభించాడు. అంతే కాదు, తన అదృష్టాన్ని క్లబ్బులో పరీక్షించమని స్నేహితు లిచ్చిన సలహా అమూల్యంగా భావించి పేకాట సాగించాడు. పదులూ, యాభైలూ, వందలూ పోయినప్పుడు పోయినా, తిరిగి సంపాదించినప్పుడు కొడిగట్టిన దీపాన్ని ఎగద్రోసి నూనె పోసినట్టయి ద్విగుణీకృతోత్సాహంతో ఆటలో దిగసాగాడు. రెండెంకరాలు పోయాయి.

సావిత్రమ్మ కంగారు పడ్డది. ఆమె ఏమన్నా అంటే "మరి డబ్బు ఇంకెలా వస్తుంది? పిల్లల భవిష్యత్తేమిటి. సంపాదించా లనేకదా నేను అవస్థపడేది" అనేవాడు. ఏమనటానికీ ఆమెకి నోరు వచ్చేది కాదు. నిట్టూర్చేది. ఏదో నీడ ఆ ఇంటిని కప్పేస్తోంది. నీడ పడ్డదంటే ఎక్కడో వెలుగుండాలి. ఎక్కడో –

ఎక్కడిదో వెలుగు తమ ఇంట్లోనే ఒకరాత్రి ప్రసరించింది. మూడువేలు ఒక్కరాత్రిలో జేబులో వేసుకొని

వచ్చాడు నారాయణరావు. అతని సంతోషానికి మేరలేదు. సావిత్రమ్మ ముఖం కళకళ లాడింది. ఎక్కడిదో నను కుంది వెలుగు! అయితే వెంటనే ఆమె ముఖం చిన్నబోయింది నీడ ఎక్కడో! ఏదో దిగులు ఆమె గుండెల్లో గూడు కట్టుకుంది. కాని తాత్కాలిక సంతోషం ఆమెకి ఉల్లాసాన్నే కలిగించింది. దానికి తోడు నారాయణరావు ఉత్సాహంగా ఒక మంచిమాట అన్నాడు.

"సావిత్రీ, ఇంత డబ్బు నా దగ్గిరుంటే రేపు ఏ మౌతుందో చెప్పలేను. ఎందుకైనా మంచిది. ఇది నీ పేర బ్యాంకులో వేస్తాను."

"నా పేర వెయ్యట మెందుకండీ. నిక్షేపంలాంటి కొడుకుండగా. మన చలపతి పేర వెయ్యండి." అందామె.

ఇంక చలపతి సంగతి: చలపతి బుద్ధిమంతుడు కాడని ఎవరూ అనరు. ఎందుకంటే బడిలో వేసినప్పటినించీ ప్రతిక్లాసూ ప్యాసై ఇప్పుడు బి. ఏ. ఫైనలియర్ చదువుతున్నాడు. చదువులో కొంత అదృష్టవంతుడనే చెప్పాలి. మొదట మొదట కష్టపడి చదివి బాగా మార్కులు తెచ్చుకునేవాడు.

"ఎందుకోయ్ మార్కులు; కూటికా గుడ్డకా? ప్యాసు కావటానికి ముప్పయి అయిదు చాలవూ? దానికోసం ఇంత కష్టపడి రాత్రింబగళ్లు చదవాలా? నేను రాజాలా తిని తిరుగుతాను. పరీక్షల ముందు కొన్ని ముఖ్యమైన టాపిక్స్ చదివివేస్తాను. బస్. థర్టీఫైవ్ పర్సెంట్. ప్యాస్. అంతే." అని విలువైన సలహాను అతని ముఖ్యస్నేహితుడు పి. యు. సి. చదువుతున్నప్పుడు అయాచితంగా ఇచ్చేశాడు. చలపతికి అది కొంత నచ్చింది. అమల్లో పెట్టి పి. యు. సి అగడ్తని సునాయాసంగా లంఘించాడు. ఇప్పుడు అదే సూత్రాన్ని అవలంబించి ఏదో మూడు ముక్కలు వీలైనప్పుడు నెమరేస్తుంటాడు అలా అని చలపతిని సోమరిపోతు అనటానికి వీల్లేదు.

నాటకాలంటే చలపతి చెవి కోసుకొంటాడు. ఎక్కడ నాటకం వేసినా హాజరు. అతనికి మంచి కంఠం ఉంది. ఎప్పుడూ రాగాలు తీస్తుంటాడు. అతని ధ్యేయం ముందు నాటకరంగం; అక్కడినించి సినిమారంగం అతనికి చాలా మంది ఆరాధకు లున్నారు వా ళ్ళెప్పుడూ అతని చుట్టూ తిరుగుతూ అత నప్పుడే సినిమాలో చేరిపోయినట్టుగా కొలుస్తుంటారు. దాంతో చలపతికి గొప్ప ఆత్మవిశ్వాసం కలిగింది. కేవలం సినిమాల్లో, నాటకాల్లో నటించటానికే తను జన్మ ఎత్తినట్టు భావించసాగాడు. కాలేజీ నాటకాల్లో, పాటల పోటీల్లో సంపాదించిన బహుమతులు తన కళాజీవిత నాటకానికి నాందీ ప్రస్తావనలని విశ్వసించాడు. ఏ సినీతార వచ్చినా ప్రయాసపడి




"ఆఫీసరుగారు పనిలో ఉన్నారు, కొంచెంసేపు ఆగండి!"
"నేను రావుబహద్దూర్ని మీకు తెలుసా?"
"ఆ, తెలుసు మా ఆఫీసరుగారు భారతభూషణ్."

ఇంటర్వ్యూ సంపాదించి పరిచయం చేసుకొని తనే ఆ సినిమా తార స్థానంలో ఉన్నట్టు ఊహాలోకంలో విహరిస్తాడు.

చలపతికి ఇంతగా నాటక సినిమా రంగాలమీద వ్యామోహం ఉన్నా, బి. ఏ. ప్యాసుకావా లనే కాంక్ష గాఢంగానే ఉంది. గ్రాడ్యుయేట్ అయితే గాని గౌరవం ఉండదు. సినీ ఫీల్డులో గ్రాడ్యుయేట్‌గా ప్రవేశిస్తే ఇంక తిను దర్జాకీ, ప్రఖ్యాతికీ, భవిష్యత్తుకీ ఎట్టి విధమైన ఆటంకం ఉండదని అతని అభిప్రాయం. లేకపోతే ఈపాటికి ఎప్పుడో మద్రాసులో రెక్కలుగట్టుకు వాలేవాడు.

కాలేజికి ప్రయాణమౌతున్న చలపతిని పిలిచి నారాయణరావు అన్నాడు:

"ఒరేయ్ చలపతీ, అలా బ్యాంకుకి వెళ్ళివద్దాం. మూడు వేలు డిపాజిట్ చేయాలి. ఇది పద్మ పెళ్ళి కోసం. డబ్బు వచ్చినప్పుడల్లా ఈ అకౌంటులో వేస్తూంటాను. పదివేలైనా కావాలిగదా! పద్మ పెళ్ళికి తప్ప ఈ డబ్బు వాడటానికి వీల్లేదు. బుద్ధి పుట్టి తీస్తానేమోనని. నీ పేర బ్యాంకులో వేస్తాను. నేనడిగినా ఈ లోపల నువ్వు డబ్బు తీయవద్దు. తెలిసిందా?"

వివరాలు అడగడం చలపతి కిష్టం లేదు. "సరే" అని తలూపి తండ్రి వెంట ప్రయాణమయ్యాడు.

పద్మ ఈ వివరాలు వింటూనే ఉన్నది. క్రితం రాత్రి నాన్న చెప్పినదీ విన్నది. ఏమిటో. ఆకాశానికి నిచ్చెనలు వేస్తున్నారని ఆమెకి పూర్తిగా తెలుసు. ఆ కొంప చిల్లులు పడిన గొడుగు అనీ ఆమె గుర్తించింది. స్కూల్ ఫైనల్ ప్యాసయి మూడేళ్లయింది. కాలేజీ చదువు చదవాలని ఉబలాటపడ్డా... కాని అది సాగలేదు.

పక్కవాటాలోని నీరజ తన క్లాస్ మేట్. అదీ స్కూల్ ఫైనల్‌తో మానేసింది. వాళ్ళూ ఉన్నవాళ్ళు కాదు. కాని అదృష్టం అంటే దానిదీ. పెద్ద చదువు లేకపోయినా మంచి సంబంధం దొరికింది. కిందటి వేసవిలోనే పెళ్ళి ఐంది. చుట్టాలింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు అతను నీరజని చూశాట్ట- కలవారబ్బాయి. ఆనర్స్ పాసయాడు. కట్నం దమ్మిడీ తీసుకోకుండా తలిదండ్రుల మాట కెదురాడి నీరజే కావాలని పట్టుపట్టి చేసుకున్నాడు. పెళ్ళయింతరవాత క్లాస్ వన్ ఆఫీసరుగా సెలెక్టయాడు. అదృష్టమంటే అదీ.

నీరజ చెప్పింది. తనంటే అతనికెంతో ప్రేమట. ఇంట్లో ఉన్నంత సేపూ తన దగ్గరే ఉంటాడట. తనేం చేసినా మెచ్చుకుంటాడట. ఏ చీర కట్టినా చీరకే అందం వచ్చిందని ప్రశంసిస్తాడట. బీద ఇంట్లో పిల్ల అనే తారతమ్యం ఎప్పుడూ మాటల్లో కూడా రానీయడట. అయినా అది వేరే చెప్పటం దేనికి? ప్రత్యక్షంగా కనిపిస్తూంటే! మళ్ళీ ట్రెయినింగ్‌కి వెళ్ళాలని ఒక నెల రోజులనించీ అతనక్కడే ఉంటున్నాడు. అర్ధరాత్రి దాటేదాకా ఆ గదిలో లైటు వెలుగుతూనే ఉంటుంది. ఏమిటో మాటలు వినిపిస్తూనే ఉంటాయి. అంత సేపు మాట్లాడటానికి ఏం మాటలు ఉంటాయో! ఆమెకి కొంచెం ఆశ్చర్యంగానే ఉంటుంది.

కోలముఖం. చెంపకి జారేసి కళ్ళు. నీరజ చక్కని చుక్క. అయితే ఉంగరాలు తిరిగి, ఇంద్రనీలమణులతో పోటీ పడుతూ పిరుదుల్ని కవ్వించే కేశసౌందర్యం ఆమెకి లేదు. తను ఒప్పుకోవాలే గాని తలనూనెల కంపెనీల వాళ్ళు పోటీలుపడి తన ఉంగరాల జుట్టుని ప్రకటించుకునే హక్కు కొనేసి పత్రికలన్నిటినీ తన బొమ్మలతో నింపేస్తారని క్లాస్ మేట్స్ హాస్యమాడుతుండేవాళ్ళు. చారుకేశి, హరిణలోచని, చంద్రముఖి అని తనకి నిక్‌నేమ్స్. కాని దేనికైనా పెట్టిపుట్టాలి కాబోలు! చివరికి ఏ ఎలిమెంటరీ టీచరో తనకి రాసిపెట్టి ఉన్నాడేమో! ఆ ఊహ రాగానే ఆ హరిణలోచనాల్లోని తళుకు బెళుకులన్నీ మాయమై పద్మ నేత్రాలు తెల్లవారుజామున మినుకు మినుకు మనే చుక్కలైపోతాయి.

*    *    *



"ఈసారి ఎక్కడికి పోతావు. మేమంతా నీ బస్సుకిందపడి చచ్చినవాళ్ళమే."

పద్మ పట్టుపట్టి టైపు నేర్చుకొంటోంది. సాయంకాలం ఐదింటికి టైప్ ఇన్‌స్టిట్యూకి వెళ్ళి ఆరింటికి తిరిగి వస్తుంది. మొదట మొదట గమనించలేదుకాని తర్వాత పద్మ ఒక విషయం కనిపెట్టింది. మెయిన్‌రోడ్డు మలుపులో ఒక మేడ ఉంది. ఆ మేడమీది వరండాలో ఒక వ్యక్తి నిలబడి ఉంటాడు. తను వెళ్ళేటప్పుడూ, తిరిగి వచ్చేటప్పుడూ తనవైపు గుడ్లప్పగించి చూడటమే అతని ఉద్యోగంలా ఉంది. మొదట పద్మకి చిరాకేసింది. తర్వాత కొంచెం కూతూహలం పెరిగింది. అత నెవ్వరో! కాని తన కేమీ పట్టనట్టు ఆమె వెళ్ళి వస్తూనే ఉంది.

శృతిమించి రాగానపడింది. ఒక రోజున అతను పద్మని అనుసరించాడు. మర్నాడు ఇన్‌స్టిట్యూట్‌కి వెడుతున్నప్పుడుకూడా అతను తన వెంటపడటం ఆమె కనిపెట్టింది. వెనక్కి తిరిగి "రాస్కెల్" అందా మని చటుక్కున ఆగింది. కాని తమాయించుకుని ముందుకి సాగింది.

టైప్‌మెషీన్ ముందు కూర్చుని 'అమ్మయ్య' అనుకుని వెనక్కితిరిగి చూసింది. ఆమె ముఖం జేవురించింది. అతను లోపలికి అడుగు పెట్టాడు. ప్రొప్రయిటర్‌తో ఫిర్యాదు చేద్దామనుకొని లేవబోయింది. ఇంతలో ప్రొప్రయిటరే వచ్చి "ఇదిగో, ఈ మెషిన్‌మీద ప్రాక్టీసు చెయ్యండి" అని అతనికి పద్మ పక్కనే ఉన్న టైప్‌రైటర్ చూపించాడు.

పద్మ నాలిక కొరుక్కుంది. ఉక్రోషంతో ముఖం ముడుచుకుంది. అతను

చిరునవ్వుతో ఆమె పక్కనే ఆసీనుడై టైపు చేయటం ప్రారంభించాడు.

"మీ స్పీడెంతండీ?"

తననే అడుగుతున్నాడని తెలిసినా పద్మ మాట్లాడలేదు.

"నాకు ఎబిసిడి లా రావండీ. ఇదే మొదలు" అతను చనువు కల్పించుకోసాగాడు.

"మాస్టరుగారూ, నాకేమీ నేర్పకుండా పోయారేం?" అతను గట్టిగా అన్నా టైప్ రైటర్ల మోతలో ఆ మాటలు ప్రొప్రయిటర్ కి వినిపించలేదు. అదీ గాక అప్పుడే ఆయన కేదో పెద్ద జాబ్ వర్క్ తగిలింది. జాబ్ వర్క్ వచ్చిందంటే స్టూడెంట్లసంగతి ఆయనకి జ్ఞాపకం ఉండదు.

"మాస్టారికి గిరాకీ తగిలింది. ఏమండీ, మీ పుణ్యం ఉంటుంది. ఎలా మొదలుపెట్టాలో చెప్పండీ" ఎంతో పరిచయం ఉన్నట్టుగా అత అడిగాడు.

పద్మ ఒక్కసారి ఇన్ స్టిట్యూట్ కలయచూసింది. అందులో పదిహేను మెషిన్లు ఉన్నాయి. అన్నీ టకటక మోగుతూనే ఉన్నాయి. స్త్రీ పురుషులకి అక్కడ ప్రత్యేకస్థానాలులేవు. ఎవరి గొడవ వారిదీ. లోయర్, హైయర్ ప్రాక్టీసింగ్ లో ఎవరిఅవస్థ వారు పడుతున్నారు.

కేవలం మర్యాదకి పద్మ ఆతని మెషిన్లో కాగితం పెట్టి "ఎ ఎస్ డి ఎఫ్ జి హెచ్ - మొదటిపాఠం అంటే, ఇదిగో ఇలాటి టైప్ చేయాలి" అని ఒకవరస టైపు చేసి చూపించి స్వస్థానంలో కూర్చుంది.

"థాంక్స్. మీరు ఏ పరీక్షకి కూర్చుంటున్నారు?" అన్నాడతను.

"లోయర్ గ్రేడ్" అందామె అయిష్టంగానే

"నేనుసరదాకి నేర్చుకుంటున్నానండీ. నాకు పరీక్షల అవసర మేంలేదు. పోర్టబుల్ టైప్ రైటర్ కొందా మనుకుంటున్నాను."

"ఉఁహుఁ."

"మీరు కాలేజిలో చదువుతున్నారా?"

"లేదు"

"ఎంతవరకు చదివారండీ?"

"స్కూల్ ఫైనల్."

"ఐసీ మె ఐ నో యువర్ నేమ్ ప్లీజ్"

"పద్మ."

"అలాగాండీ. చాలా బావుంది. నా పేరు శంకర్ అండి. లిటరేచర్ ఆనర్స్ ఫైనలియర్ చదువుతున్నాను"

పద్మ గబుక్కున తలెత్తి అతనివైపు ఓ సారి చూసి తనపనిలో నిమగ్నమైంది.

"అయితే టైప్ రైటింగ్ నేర్చుకోటం ఎందుకంటారేమో. చెప్పాను కదూ. పోర్టబుల్ కొందామని వుంది. ఫారిన్ వెళ్ళి రిసెర్చి చేయాలని ఉబలాటము. ఆనర్స్ లో ఫస్ట్ క్లాస్ వస్తేగాని సీటురాదు. కష్టపడి చదువుతున్నా ననుకోండి.

మాన్ ప్రపోజెస్ గాడ్ డిస్పోజెస్; ఏమంటారు?"

అతను నవ్వుతూ ఆమెవైపు చూశాడు. పద్మకి అతనిమాటలు కొంత ఉత్సాహాన్నీ, కొంత నవ్వునీ కలిగించాయి. ఎంతో పరిచయమున్నట్టు మాట్లాడుతున్నాడు పైగా తనేదో బంధువైనట్టు అమాయికంగా తనగొడవ చెప్పుకుంటున్నాడు. పాపం, అతను తను అనుకున్నట్టు ఆకతాయి కాడేమో!

కొంతసేపయింతరవాత పద్మ యింటికి దారి తీసింది. అతను వెంబడించలేదు. ఎటో వెళ్ళిపోయాడు. అతనిపట్ల కొంత సుహృద్భావం కలిగిందామెకి. మర్నాడు. మళ్ళీ అతను హాజరు. హుషారుగా మాట్లాడాడు. పద్మ కొంచెం మాటలు కలిపింది. కొంతసేపయింతర్వాత ఇద్దరూ ఆ వీధిదాకా కలిసే వచ్చారు.

పరిచయం వృద్ధి అయింది. పద్మ అడక్కుండానే శంకర్ తన వివరాలన్నీ ఆమెకి చెప్పాడు. అలాగే ఆమె వివరాలు తెలుసుకున్నాడు. పద్మ తెలివితేటల్ని అతను మెచ్చుకోని రోజులేదు. ఒకరోజు ఇంటికివస్తూ, "టైప్‌రైటర్‌కీ బోర్డుమీద మీ సన్నటి చేతివేళ్ళు నాట్యం చేస్తుంటే గలగల గాజులు వీణ వాయిస్తూ, టైప్‌రైటర్ ధ్వనికి లయ కల్పిస్తూ, నన్ను మరో దివ్యప్రపంచంలోకి తీసుకుపోతాయండీ" అన్నాడు శంకర్.

ఆ మాటలకి పద్మ పరవశించింది.

"ఆ తెల్లచీర మీ కెంత అందాన్నిస్తుందండీ! తెలుపురంగంటే నా కెంతో ఇష్టం. చూడండి; వందలకి వందలు మా నాన్న పంపిస్తున్నా, నేనెప్పుడూ ఈ తెల్లబట్టలే వేసుకోటం ఎందుకనుకొంటున్నారు? తెలుపులో ఏదో స్వచ్ఛత ఉందండీ. అది మనసుని మైమరపిస్తుంది."

పద్మ అతని మనోనైర్మల్యాన్ని ఇక శంకించలేదు.

"గులాబీకి ఎంత లావణ్యం ఉన్నా నాకు మల్లెపువ్వు అంటేనే ఇష్టమండీ. కాని మిమ్మల్ని చూసిం తరవాత నాకు గులాబీ పువ్వులో ఇదివరకు కన్పించని అందాలు కన్పిస్తున్నాయండీ."

ఎరుపెక్కిన కపోలాలవైపు చూస్తూ అతనలా అంటే పద్మ సిగ్గుతో తల వంచుకునేది. ఆ క్షణంలో ఆమె దృష్టిలో నీరజా ఆమె భర్తా మెదిలేవాళ్ళు. తనకీ అంత అదృష్టం కలగబోతోందా!

పద్మ ఇప్పుడు తరుచు బీచ్‌కి వెడుతోంది. శంకర్ ఏవో కబుర్లు చెబుతూ త్వరగా కదలనివ్వడు. ఇంట్లో పరీక్షలు దగ్గిర వస్తున్నాయనీ, మరికొంతసేపు టైపు చేస్తున్నాననీ సంజాయిషీ చెప్పటం పద్మ అలవాటు చేసుకుంది.

మంచి పిక్చరున్నదని శంకర్ సినిమా ప్రోగ్రాం వేశాడు. పద్మ సంకోచించింది. అతను బలవంతం చేశాడు. లోపల

ఇష్టంగానే ఉన్నా పద్మ ఎవరైనా చూస్తే ప్రమాద మని భయపడ్డది.

"పెళ్ళి చేసుకోబోయేవాళ్ళు ఎవర్ని చూసి భయపడాలి?" అని ప్రశ్నించాడు శంకర్. పద్మ సాహసించింది.

స్నేహితురాలితో సినిమాకి వెడుతున్నానని అమ్మకి చెప్పి పద్మ థియేటర్ చేరింది. రెండు రిజర్వ్‌డ్ టికెట్లు తీసుకొని శంకర్ గేటుదగ్గిర కాచుకొని ఉన్నాడు. థియేటర్లోకి వెళ్ళి కూర్చుని పద్మ బెరుగ్గా హాలంతా కలయ చూసింది. తెలిసినవాళ్ళెవరూ కనిపించ లేదు. సినిమా చూస్తున్నంతసేపూ ఆమె ఊహల్లో శంకరే మెదుల్తూ ఉన్నాడు. శంకర్ తనని నిజంగా వివాహం చేసుకుంటాడా? అదే నిజమైతే తనంత అదృష్టవంతురాలెవరూ ఉండరు.

ఒకగంట సినిమా చూసి శంకర్ తలనొప్పిగా ఉందన్నాడు.

"ఇంటికి వెడదాం; రెస్ట్ తీసుకోండి," అంది పద్మ ఆత్రుతగా.

ఇద్దరూ థియేటర్ బయటికి వచ్చారు.

"నేను రిక్షాలో ఇంటికి వెడతాను," అందామె.

"చల్లగాలి తగిలితే తలనొప్పి తగ్గుతుంది. నడిచిపోకూడదూ?" అన్నాడతను.

"ఎవరైనా చూస్తే?" అందామె.

"పాపం, భయం," అన్నాడతను "మీ కేం!" అంది పద్మ.

ఇద్దరూ నడవసాగారు. మేడ సమీపించగానే పద్మ వెడతానంది.

"అలా పారిపోవటానికి నేను బెబ్బులినికదూ!" అన్నాడతను.

"ఎవరైనా చూస్తే!" అందామె బెరుగ్గా.

"తలనొప్పిగా ఉంది. కాస్త కబుర్లు చెబుతావేమో ననుకున్నాను," అన్నాడు చిన్నబుచ్చుకున్నట్టు.

మరేమీ అనకుండా పద్మ మేడలోకి దారితీసింది. ఆ మేడ కిందిభాగంలో ఏదో ఆఫీసు, పైన కొంతవరకే మేడ. మిగతాదంతా వరండా.

"అలా కూర్చోండి," కుర్చీ ఆమెకి దగ్గిరగా లాగాడు శంకర్. పద్మ మాట్లాడకుండా కూర్చుంది. శంకర్ ఫ్యాన్ స్విచ్ వేసాడు. ఆమె గదంతా కలయచూడ సాగింది. స్టీల్ కుర్చీలు, టేబిల్, డబుల్ పరుపు, ట్రాన్‌సిస్టర్ రేడియో, కె. డి. కె. ఫ్యాన్ – ఇవన్నీ చూసి ఆశ్చర్యంగా పద్మ అడిగింది.

"ఏమండీ, ఇది ఫామిలీపోర్షనా?"

"ఫామిలీ ఇంకా లేందే!" అన్నాడు శంకర్ నవ్వుతూ.

"చదువుకోటానికేనా అని!" ఆమెకూడా నవ్వింది.

"ఏం చేస్తాం. ఇవన్నీ మానాన్న బలవంతాన ఇచ్చిపంపాడు. అలాని నేను

"నీకోసం ప్రాణమయినా విడుస్తాను సీతా!"

"మరి నిన్నసాయంత్రం ఎందుకురాలేదు?"

"జోరున వర్షం — చావమంటావా?"

---

ఖుషీ చేస్తున్నా ననుకునేరు. ఫస్ట్‌క్లాస్ రావాలండోయ్. అన్సర్ పేపర్లు చూపించేదా?'' అత నేదో వెతకబోయాడు.

''అక్కర్లేదులెండి,'' అంది పద్మ.

"సిగరెట్ తాగే అలవాటుకూడా నాకు లేదండోయ్. ఈమధ్య నిద్ర మేలుకోవాలని ఇప్పుడిప్పుడే అలవాటు చేసుకుంటున్నాను." యాష్‌ట్రే టీపాయ్‌మీద పెడ్తూ అన్నాడు.

"ఎందుకండీ పాడు సిగరెట్లు?"

"పరీక్షలకి చదవొద్దండీ. మీరు మానేసెయ్యమంటే మానేస్తాను. ఏం మానేయనా?"

"ఊఁ."

యాష్‌ట్రే దూరంగా కిటికీలోంచి విసిరి పారేశాడు శంకర్. ఆమె విస్ఫారిత నేత్రాలతో అతనివైపు చూసింది. తన మాటమీద అతని కంత గౌరవం ఉందా.

"ఓపాటపాడుదురూ. తల దిమ్మెక్కిపోతోంది"

"పాటే వస్తే మా చలపతిలా నేనూ ప్లేబాక్ సింగర్‌గా ట్రై చేయకపోయేదాన్నా! ట్రాన్సిస్టర్ ఉందిగా. ఏదో సేషన్ పెట్టండి. చెవులతుప్పు వదిలిపోతుంది" అన్నాడు నవ్వుతూ.

"బాబోయ్, తల పేలిపోతుంది. అది మాత్రం వద్దు."

ఆమె నవ్వింది

"మరి మందు వేసుకోండి."

"డాక్టర్ పరీక్షించి మందిస్తేగదా."

"మరి డాక్టర్‌దగ్గిరికి వెళ్ళండి."

"మీ కంటే నాకు బాక్త రెవరు?" ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు శంకర్

"బాగుంది, నాకేం వైద్యం వచ్చా, ఏమన్నానా ?"

"ప్రథమచికిత్స కూడా రాదుకదూ?"

పద్మ మందహాసంతో అతని నుదురు మీద చెయ్యి వేసింది. ఆ చెయ్యి హృదయానికి అదుముకున్నాడు శంకర్. మొక్కిన దేవత లందరూ వరా లిచ్చినట్టు అనుభూతి పొందింది పద్మ. తటాలున శంకర్ ఆమె నడుంచుట్టూ చెయ్యి వేసి పద్మని హృదయానికి అదుముకున్నాడు. ఆమె ఒక్క క్షణం తనని తాను మర్చిపోయినా వెంటనే సంబాళించుకుని విడిపించుకో ప్రయత్నించింది శంకర్ ఆమె కళ్ళలోకి చూస్తూ మనం వివాహం చేసుకుంటాం పద్మా" అన్నాడు.

"మీ రెంతో మంచి వారండీ," అందామె.

"మరి పారిపోతావేం" అంటూ అతనామె పెదవుల్ని చుంబించాడు

"నన్ను ఇంక వెళ్ళనివ్వండి." ఆమె గాభరాగా విడిపించుకో సాగింది. అతను కౌగిలి విడవలేదు.

"లేడిపిల్లలా బెదరిపోతావేం ?"

"క్షమించండి - తప్పు మీరు మంచి వారుకదూ," పెనుగులాడింది.

"కాదు. నేను బెబ్బులిని. '

అతనామెని విడిచి ముఖం చిట్లించుకున్నాడు. ఆమెకి ఎటూ తోచలేదు

"కోపగించుకోకండీ," పద్మ బతిమాలింది.

"కోప మెందుకూ ? నాకు బుద్ధి చెప్పావు. నేను నట్టి దుర్మార్గుణ్ణి. ఆడపిల్లల్ని నమ్మించి ద్రోహం చేసేవాణ్ని. అంతేకదూ."

"ఛీ ఛీ. అలా అనకండి."

"అదేగా, నీ అభిప్రాయం? సరే. నా పాపాన నేను పోతాను. నేనేమైనా నీ కనవసరం - అంతేగా ప్రేమిస్తున్నావని పొరపడ్డాను. నా ప్రేమ అర్థం చేసుకున్నావనుకున్నాను మూర్ఖుణ్ణి."

అతనికి అంతకోపం రావట మెందుకో పద్మకి అర్థం కాలేదు. ఏదో విపరీత విచిత్ర పరిస్థితిలో తను ఇరుక్కున్నట్లు ఆమెకి భయం కలిగింది. తను అతన్ని అపార్థం చేసుకుందా ? వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాడు తనెంతో అదృష్టవంతురాలినని మురిసిపోయింది. ఇంతలో ఏమిటీ అనర్థం ? ఒకవేళ అతనికి తనమీద మోజేగాని ప్రేమ లేదేమో. ప్రేమే ఉంటే ఇలా స్వార్థంగా ప్రవర్తిస్తాడా ? ఉచితానుచితాలు ఎరగడా ? శంకర్‌లో కొంత అమాయకత ఉంది. కావాలని అడిగింది ఇవ్వకపోతే పిల్లవాడు మారాం చేసినట్టుగా ప్రవర్తించే స్వభావం కాబోలు అతన్ని అలా వదిలేసి వెళ్ళిపోతే ఇన్నాళ్ళూ పెంచిన ప్రేమలతతోబాటు ఆశ లన్ని



టినీ కూలదోసుకోటమే అవుతుందా! భగవాన్, ఏదిదారి ?

పద్మ అతని చేరువగా వెళ్ళి జుట్టు నిమురుతూ "నన్ను అపార్థం చేసుకోకండి. మీకంటే నాకు కావలసినవాళ్ళెవరు ?" అంది.

''లోకం ఉందిగా,'' అన్నాడతను గునుస్తూ.

అదేమి మనస్తత్వం! ఆమెకి ఆశ్చర్యమే వేసింది. ముందు గొయ్యి. వెనక నుయ్యి. కాని ముందు గొయ్యి అనేది భయకల్పితమేనేమో! దేవుడికెరుక! ఏం చేసేట్టు! ఆమె అలాగే కూర్చుండిపోయింది.

కొంచెంసేపు నిశబ్దంగా గడిచి పోయింది.

''నన్ను క్షమించు పద్మా; నీ మనసు గాయపరిచాను.'' శంకర్ పశ్చాత్తాపం సూచించే స్వరంతో ఆమె చుబుకాన్ని స్పృశించి అన్నాడు.

పద్మ పొడిగా నవ్వి తలూపింది. అది నిజమైన తలనొప్పేనా!

శంకర్ డ్రాయర్‌లోంచి పేక తీసి ముక్కలు పరిచాడు.

"పందె మేమిటి?"

''పందెం వేస్తే నే నాడనుబాబూ." అంది పద్మ.

"అబ్బో, కబుర్లు చెప్పకు. నాకు తెలుసులే. మీ నాన్నది పెద్దచెయ్యేటగా. అ అంశ నీకూ కాస్తోకూస్తో అబ్బకుండా ఉండదు!" అతను నవ్వాడు.

మళ్ళీ పద్మ పొడిగా నవ్వింది.

"సరే. మీ ఇష్టంవచ్చిన పందెం."

"రైట్."

ఆట అయింది. శంకర్ పందెం గెల్చుకున్నాడు. అతను గెల్చుకున్న పందెం తీసుకోటానికి పద్మ అడ్డు చెప్ప లేదు.

* * *

ఫిల్ము ఫీల్డులో ఏడెనిమిదేళ్ళ అనుభవంగల సినీ ఎక్జిబిటర్ ఒకాయన ఆ ఊరికి టూర్ వచ్చాడు. అతను చలపతి పాట విని "గోల్డెన్ వాయిస్" అని పరవశించి అమాంతం చలపతిని కౌగలించుకున్నాడు. దాంతో చలపతి ఉబ్బి తబ్బిబ్బు లైపోయాడు. ఆ ఎక్జిబిటర్ మీద అతని కత్యంత గౌరవాభిమానాలు పెంపొందాయి. ఆయన పేరు మూర్తి. ఆయన మాటలు వింటే ఫిల్ము ప్రపంచంలో అతనికి తెలియని, అతను నిర్వహించని శాఖంటూ ఏమీ లేదని పసిపిల్లవాడికి కూడా తెలిసిపోతుంది. ఇంత తెలిసిం తర్వాత ఇంక ఏదో ఒక శాఖలో పాతుకుపోయి పరిసించి పోవటము ఆయనకి నచ్చలేదుట. అందువల్ల సొంతగా ఒక కంపెనీ స్థాపించి సాధ్యమైనంత వరకూ అన్ని శాఖలూ తనే నిర్వహిస్తూ ఒక అత్యుత్తమ చిత్రాన్ని వెండితెర కెక్కించాలని ఆయన ఆశయంగా పెట్టుకున్నాడట. ప్రస్తుతం అందుకోసమే మందీ మార్బలం సమకూర్చుకోవాలని ముఖ్య పట్టణాలలో టూర్ చేస్తున్నాడట. ముఖ్యంగా పెద్ద పెట్టుబడి పెట్టే ఆసామీకోసం గాలం వేస్తున్నాడట. సరే, ఇదంతా ఆయన స్వంత గొడవ. చలపతికి సంబంధించినంత వరకూ మాత్రమే మనకి కావలసింది.

"ఇటువంటి గోల్డెన్ వాయిస్ నే నెప్పుడూ వినలేదండీ. విచంగా చెవుల తుప్పు ఒదలిపోయింది." అన్నాడు మూర్తి.

"ఏదో, మీ అభిమానం లెండి." అన్నాడు చలపతి సన్నసన్నగా.

"మీరు ఇలా ఇక్కడ రాట్ కావట

మేమిటండీ అమాంతం ఎగిరి మాద్రా సులో దూకండి."

"బి. ఏ. ఒకటి ఉందండీ. పరీక్షలు దగ్గిరికి వస్తున్నాయి. ఈ పరీక్ష లయితే ఇహ నా కదేపని." అన్నాడు చలపతి

"సరే. అదీ మంచిదే. అయినా వెంటనే మద్రాసు వెళ్ళినా ప్రయోజనం కూడా ఉండదులెండి. ఏదో ఉత్సాహంలో అనేసానే గాని, అబ్బో. అక్కడ ఎన్ని లొసుగులండీ! రామ రామ, ఒట్టి సైడుకాలవండీ." అని పెదవి విరిచాడు రామ్మూర్తి.

చలపతి గుండెల్లో కొంచెం డిగులు పొడచూపింది

"అదేమిటండీ అలా అంటారు?"

"ప్చ్. మెరిట్ ఎవరిక్కావాలండీ. అక్కడంతా మహా కట్టుదిట్టం. కొత్తవా డెక్కరావాలనుకుంటే విశ్వామిత్ర తపస్సు కావాలిసిందే. నా మట్టుకు నాకు కొత్త ముఖాల్ని చూస్తానని గానీ, కొత్త గొంతులు వింటాననిగానీ నమ్మకం లేదు." మూర్తి తేల్చేశాడు.

ఇంక చలపతి మూర్తిచుట్టూ తిరగ డమే పనయింది. తిరగ్గా తిరగ్గా ఆయన కరుణించాడు. ఆయన కెవరో మ్యూజిక్ డైరెక్టర్ తెలుసట. కాని తడి తగిల్తేకాని ఆయన మాట వినిపించు కోడట. ఓ నాలుగైదు వేలన్నా కావా లిట. డబ్బు చూస్తేమాత్రం తప్పక ఛాన్సు ఇప్పిస్తాడట. ఇంక పైకి రావట మనేది వ్యక్తి ఉపజ్ఞమీద, ప్రతిభమీద ఆధారపడి ఉంటుందనీ, అయితే ఆ విషయంలో చలపతి కేమీ ఢోకా లేదనీ అభయ మిచ్చాడు.

చలపతికి పెద్ద సమస్య ఎదురైంది. చటుక్కన పరిష్కారము మెరుపులా మెరిసింది. తన పేర బ్యాంకులో మూడు వే లున్నాయి. అవసరానికి అవి వాడుకున్నా, తను కాస్త పేరు సంపా దించుకుని ఆర్జించటం మొదలు పెడితే అలాంటి మూళ్లు ఎన్నయినా తనకో లెక్కా. పద్మ పెళ్ళి మహా వైభవంగా సొంతఖర్చుతో జరిపించడూ!

మెరుపులా మెరిసిన పరిష్కారం మెరుపులాగే అదృశ్యమైంది. ఒకవేళ తను విఫలుడైతే! ఆసలు ఛాన్సే రాక పోతే! ఈమూర్తిగారు పెద్దమనిషిగానే కనిపించినా మధ్యలో ఎన్నో అవాంత రాలు! సిద్ధాన్నంకూడా దక్కని సంద ర్భాలు తనకి తెలుసు! ఫిల్మ్ ఫీల్డంటే తను విన్నప్రకారం ఎన్నో అగచాట్లూ, అన్యాయాలూ, మోసాలూ! నాన్న మూడువేలు ఏవని అడిగితే –?

మూర్తి తొందరచేయసాగాడు. తను వెళ్ళిపోవాలట. కనీసం మూడువేలైనా పని గడుస్తుందని హామీ ఇచ్చాడు. ఇంక చలపతికి నిద్రపట్టలేదు. తెగించి బ్యాంకులో డబ్బు తీసి మూర్తికి ఇచ్చాడు. ఎలాగైనా అవకాశం వచ్చేట్టు చూస్తాననీ, ఒక నెలరోజుల్లో

బహుశా మద్రాసుకి పిలిపిస్తా ననీ మాట ఇచ్చి మూర్తి అదృశ్యు డయాడు.

అంతే ఇంక ఆయన దగ్గర్నించి ఉత్తరంలేదు. చలపతి వారానికి ఒకటి చొప్పున ఉత్తరాలురాశాడు. కిమిన్నాస్తి. అవతలనించి కార్డుముక్కలేదు.

బహుశా ఆయన పనితొందర్లో ఉన్నాడని చలపతి మొదట్లో సరిపెట్టుకున్నాడు. లోలోపల అనుమానం వేధిస్తున్నా ఆశ వదులుకోలేదు. ఇంతలో పరీక్షలు వచ్చాయి. అదేంఖర్మమో తప్పక వస్తాయని సెలక్టుచేసి చదివినవి చాలావరకు చలపతిని వెక్కిరించాయి. ఏదో రాసాడు. దేవుడిదయుంటే ప్యాసవుతా ననుకున్నాడు.

పరీక్షలయింతర్వాత చలపతికి మరీ వ్యాకులపాటు ఎక్కువైంది. మూర్తిని గురించి ఎవర్ని వాకాబు చేసినా తెలియదనే సమాధానమే వచ్చింది.

ఒక రోజున పోస్టుమన్ చలపతిని పిలిచి ఉత్తరం ఇచ్చాడు. పోస్టుమన్ పిలుపు విని మహదానంద పరవశుడై కవరు అందుకున్నాడు చలపతి. మరుక్షణంలో అతనిముఖం పాలిపోయింది. అది డెడ్ లెటల్ అఫీసునించి వచ్చింది. మూర్తి అడ్రసు తెలియ దని డి. ఎల్. ఓ. వాళ్ళు చలపతి ఉత్తరాన్ని తిప్పి పంపారు. మకాంకూడా ఎత్తేశాడన్న మాట చలపతికి కళ్ళు తిరిగిపోయాయి.

మరికొన్ని రోజులకి పోస్టుమన్ అల్లంత దూరంలో కనిపించగానే చలపతివైపు ఉత్తరం ఉందన్నట్టు చూశాడు. ఒక్క ఉదుటన అతని దగ్గరికి వెళ్ళి చలపతి ఉత్తరం అందుకున్నాడు. కాని అడ్రసుచూస్తే అది పద్మ పేర ఉంది. కుంగిపోయి హీనస్వరంతో పద్మని కేకేశాడు.

పద్మ ఇంట్లోంచి ఒక్కగంతేసింది.

'ఎక్కడినించి ఉత్తరం."

"నా స్నేహితురాలి దగ్గర్నించిలే'' అని వెంటనే పద్మ కవరు దాచేసి లోపలికెళ్ళి చూసుకుంది. ఆమె హృదయం గబగబ కొట్టుకోసాగింది. అమ్మయ్య! ఇన్నాళ్ళకి! తనెన్నో అనవసర భయాలతో మనసు పాడుచేసుకుంది. మోసపోయానని కుంగిపోయింది దేవుడు దయతలిచాడు. పాపం, అతన్నిగురించి ఎన్నెన్నో అపోహలుపడింది. నిజంగా తను ఒట్టి కృతఘ్నురాలు!

కవరు చింపి ఉత్తరం చూసుకుంది పద్మ. మొదట ఏమీ అర్థంకాలేదు. ఏమిటిది? తను రాసిన ఉత్తరమే. డి. ఎల్. ఓ. నించి. ఆ అడ్రసుగల వ్యక్తి ఎవరూ లేరనే కారణంతో తనఉత్తరం తిరిగివచ్చింది. పద్మకి కన్నీళ్ళు గిర్రున తిరిగాయి. ఆమెకి ప్రపంచమే గిర్రున తిరిగినట్టయింది.

"పద్మా! చలపతీ! భోజనాలకి లేవండర్రా. మీరుకూడా రండి" సావిత్రమ్మ కేకేసింది

"ఇవ్వాళ మీ ప్రోగ్రాము ఇది — రెండుగంటలకు పన్నెండో నెంబరు ఎపెండిక్సు ఆపరేషన్. ఐదుగంటలకు నాలుగో నెంబరు రోగికి టాన్సిల్స్ ఆపరేషన్. రాత్రి ఎనిమిదిగంటలకు నాతో షికారు."

---

చలపతికి కొందరు నిజమైన స్నేహితులు లేకపోలేదు. అలాంటివాళ్ళలో రావు ముఖ్యుడు. అతను చలపతికి స్నేహితుడూ, ఆరాధకుడూ కూడా. కొంత డబ్బుగలవాడే. అతనితో తన అవస్థ చెప్పుకొని కన్నీళ్ళు పెట్టుకున్నాడు చలపతి. ఏదో వ్యాపారం నిమిత్తం రావుకి మద్రాసు పోయే అవకాశంకూడా దొరికింది. ఆ మూర్తిని గాలించి అతనిసంగతి తేలుస్తానని రావు చలపతికి హామీ ఇచ్చాడు.

మద్రాసువెళ్ళినమిత్రుడు రాకుండానే పరీక్షాఫలితాలొచ్చాయి. చలపతి పరీక్ష పోయింది.

"వాడు తప్పటమేమిటి? ఆశ్చర్యంగా ఉందే!" అన్నాడు నారాయణరావు.

"కాలం మనని కసిరికొడ్తోంది — ఖర్మ." అంది సావిత్రమ్మ.

చలపతి మరీ కుంగిపోయాడు. పరీక్షాఫలితాలొచ్చిన రెండురోజులకే రావు మద్రాసునించి వచ్చాడు. వార్త తెలిసి

చలపతి అతని ఇంటికి పరుగుతీశాడు. మూర్తి అనే అసామీ ఒక డున్నాడనీ, అతనికి సినిమా అనుభవం కొంత ఉన్న మాట వాస్తవమేననీ, అయితే ఆ అనుభవం అతనికి ఇతర్లని మోసగించి డబ్బు కాజేయటానికే పనికి వస్తోందనీ అతని వాకబువల్ల తెలిసిందట. ప్రస్తుతం ఆత నెక్కడ ఉన్నదీ ఎవరికీ తెలియదట ఇది విన్న చలపతి ముఖంలో నెత్తురుచుక్క లేదు. కాళ్ళీడ్చుకొంటూ ఇంటికి చేరాడు.

బాకీలు తీర్చటానికని చెప్పి నారాయణరావు ఉన్న అర ఎకరం పొలం అమ్మేశాడు. తీరా డబ్బు చేతిలోకి వచ్చేంతరవాత అది బాకీలకి ఉపయోగించటానికి అతనికి బుద్ధి పుట్టలేదు. అప్పుడే ఇంట్లో అడుగు పెడుతున్న చలపతిని చూసి ఆయన అన్నాడు: "ఒరే చలపతీ, మన కాతా వెచ్చం కొట్లో, బట్టల కొట్లో ఓ వెయ్యి రూపాయలు ఇవ్వాలి. బ్యాంకునించి తీసి ఇచ్చి చెల్లు వేయించుకురా."

ఇది విన్న సావిత్రమ్మకీ చలపతికీ గుండెలు గుబుక్కుమన్నాయి.

"అదేమిటండీ పిల్ల పెళ్ళికి దాచింది తీస్తా మంటారేం."

నారాయణరావు మాట్లాడలేదు. సమాధనం చెప్పలేనప్పుడు అతను మాట్లాడడు. త నేమన్నా అప్పుడు ప్రయోజనం ఉండదని సావిత్రమ్మకీ తెలుసు, అందుకని ఆమె మాట మార్చింది.

"పద్మ వారం రోజుల్నించీ ఏమిటో నలతగా ఉంటోందండీ. కాస్త డాక్టరుకి చూపిద్దురూ."

నారాయణరావు తలెత్తి పద్మవైపు ఓసారి చూసి, "ఆ పని కాస్తా నువ్వే చేద్దూ" అన్నాడు.

"బాగుందండీ మీ తీరు." అంది సావిత్రమ్మ, భోజనాలకి ఏర్పాట్లు చేస్తూ.

అరుణోదయ మైంది.

సావిత్రమ్మ నిద్ర లేచి పక్క చుట్టి మంచం గోడకి జేరవేసింది. కిటికీ తలుపులు వేయబోయి అలవాటుగా ఆ ముగ్గురి మంచాలవైపూ ఓసారి చూసింది. ఏం దుర్ముహూర్తమో, ఆమె నివ్వెఱపోలై, నిలువునా వొణికింది. ఆ మంచాలు మూడూ ఖాళీగా ఉన్నాయి

"చలపతీ, పద్మా!" ఆమె కేకలు వేసింది.

సమాధానం లేదు

దిగాలుగా సావిత్రమ్మ మంచంమీద కూలబడిపోయింది.

అరఎకరం పొలం అమ్మి, ఆ డబ్బంతా జేబులో వేసుకుని నిన్న మధ్యాహ్నం క్లబ్బుకి వెళ్ళిన ఇంటియజమాని రాత్రి భోజనానికికూడా రాకపోగా, ఇంతవరకూ ఇంటికే చేరలేదు.

బ్యాంకుకి వెళ్ళివస్తా నని బయల్దేరిన చలపతి రాత్రి భోజనానికి రాకపోతే

ఎక్కడో తిని ఏ సినిమాకో వెళ్ళాడను కుంది. ఇంకా ఇంటికి రాకుండా చలపతి ఏమయ్యాడు?

డాక్టరుదగ్గిరికి రమ్మంటే తన కేమీ జబ్బులేదని రాకుండా మొరాయించిన పద్మ తెల్లారగట్ల లేచి ఎక్కడికి వెళ్ళినట్టు?

సావిత్రమ్మ కేమి పాలుపోలేదు. హఠాత్తుగా ఆమె కేమో అనుమానాలు కలిగాయి.

అదొక ద్యూతగృహం! ప్రపంచమే ఒక పెద్ద ద్యూతగృహం! అందులో నిత్యం ఎవరో ఏదో పణం ఒడ్డుతూనే ఉంటారు. పద్మా, చలపతీ...

ఇక ఆలోచించలేక సావిత్రమ్మ శూన్యంగా కిటికీలోంచి బయటికిచూసింది.

సూర్యభగవానుడామె కళ్ళలోకి సానుభూతిగా చూశాడు. అప్రయత్నంగా ఆమె లేచి నుంచుంది. రోజూ తను కిటికీ తలుపులు మూసేది!

గిర్రున కన్నీళ్ళు తిరగగా, సావిత్రమ్మ తటాలున కర్మసాక్షికి చేతులెత్తి మ్రొక్కి కటాక్షించమని దీనంగా వేడుకొంది.